

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, నవంబర్4, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి సోమవారం 12,805 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయంలో 70.425 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 5, ఎన్ఎఫ్‌సికి 700, పెన్నా డెల్టాకు 2100, కండలేరు వరద కాలువకు పదివేల క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 99.544 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## ముఖ్యమంత్రిని కలిసిన వేమిరెడ్డి దంపతులు



**కోవూరు, నవంబర్ 4 ప్రభాత వార్త :** కోవూరు నియోజకవర్గ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులుగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును సోమ వారం నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి , కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు కలిసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సోమవారం అమరావతిలోని ముఖ్యమంత్రి నివాసానికి చేరుకున్న వేమిరెడ్డి దంపతులు ఆయనను కలిసి టీటీడీ బోర్డు సభ్యులుగా అవకాశం కల్పించడంపై ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కలియుగ దైవంకు సేవ చేసే అవకాశం రావడం సంతోషంగా ఉందని, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా శ్రీవారి భక్తులకు సేవ చేస్తామని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రితో వారు పలు అభివృద్ధి విషయాలపై చర్చించారు.

## 15న కార్తీక దీపోత్సవం వెల్లడించిన ఎమ్మెల్యే కోటం రెడ్డి



**నెల్లూరు రూరల్, నవంబర్ 4, ప్రభాతవార్త** కార్తీక మాసోత్సవాల్లో భాగంగా నెల్లూరులోని గణేష్ ఘాట్ వద్ద ఈ నెల 15వ తేదిన మహా కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించనున్నట్లు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరులోని రూరల్ కార్యాలయంలో సోమవారం వేదపండితుల తో కలిసి కోటంరెడ్డి విలేకరులతో మాట్లాడారు. నె ల్లూరు గ్రామ దేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం చెంత ఉన్న సర్ణాల చెరువు గణేష్ ఘాట్ వద్ద కార్తీక మాసోత్సవాల సందర్భంగా ఈ నెల 15వ తేదీ సాయంత్రం మహా కార్తీక దిపోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాశీ ఘాట్‌ను తలపించే విధంగా గణేష్ ఘాట్ వద్ద అన్నీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్తీక దీపాత్సవంతో పాటు 108 తెప్పలతో స్వర్ణాల చెరువులో శివాకృతి కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రోజు నగరంలో మహిళలతో శోభాయాత్ర కూడా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని కోటంరెడ్డి పిలుపునిచ్చారు.

## పచ్చదనం, పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి

### కావలి తహశీల్దారు పి.శ్రావణ్‌కుమార్



**కావలి, నవంబర్04 ప్రభాతవార్త** పచ్చదనం, పరిశుభ్రతకు ప్రతిఒక్కరూ పాటుపడాలని కావలి తహశీల్దారు పి.శ్రావణ్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం కావలి తహశీల్దారు కార్యాలయ ఆవరణంలో పచ్చదనం, పరిశుభ్రతకు చర్యలు చేపట్టారు. ఆవరణంలో చెత్తా,చెదారాలను తొలగించి మొక్కలను నాటారు. ఆయన తహశీల్దారుగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పాడుబడ్డ బావిని శుభ్రంచేయించి త్రాగేందుకు త్రాగునీరు వెసులుబాటు కల్పించారు. ఈ రోజు తహశీల్దారు ఆవరణం శుభ్రంచేసి మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తద్వారా ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు శ్రావణ్‌కుమార్‌తోపాటు ఆర్ఐ శివకుమార్, విఆర్ఓలు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా షూటింగ్ బాల్ సీనియర్ పురుషుల జట్టు ఎంపిక



**కోవూరు నవంబర్ 4 ప్రభాతవార్త** కోవూరు మండలం పాటూరు జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సోమవారం నెల్లూరు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆద్వర్యంలో సీనియర్స్ పురుషుల షూటింగ్ బాల్ క్రీడాకారుల ఎంపిక జరిగింది.ఈ ఎంపికలో ప్రతిభ కనబరచిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేయడం జరిగిందని నెల్లూరు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భీమతాటి వెంకటరమణయ్య తెలిపారు. ఎంపికైన ఈ క్రీడాకారుల జట్టు ఈనెల 9,10 తేదిలలో కర్నూలు జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## గ్రీవెన్స్‌కు 9 అర్జీలు



**కందుకూరు, నవంబర్ 4, ప్రభాతవార్త** కందుకూరు పురపాలక సంఘ కార్యాల యం నందు సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యా దుల డయల్ యువర్ కమీషనర్ కార్యక్రమం ద్వారా 9 అర్జీలు వచ్చినట్లు మున్సి పల్ కమీషనర్ కే.అనూష తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రతి సోమవారం కందుకూరు పురపాలక సంఘ కార్యాలయం కమీషనర్ వారి ఛాంబర్ నందు జరుగు ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఈ సందర్భంగా కమీషనర్ పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పురపాలక సంఘ పారిశుధ్య వగైరా సమస్యలు కొరకు కార్యాలయ నెంబరు 9177700267 ద్వారా తెలియజేయవచ్చని తెలిపారు.

## జిల్లా పంచాయితీ అభివృద్ధి ప్రణాళిక పై శిక్షణ



**నెల్లూరు అర్బన్, నవంబర్ 4, ప్రభాతవార్త** గ్రామ పంచాయితీ అభివృద్ధి ప్రణాళిక, మండల బ్లాక్ పంచాయితీ అభివృద్ధి ప్రణాళిక జిల్లా పంచాయితీ అభివృద్ధి ప్రణాళిక 2025 - 26లపై మంగళవారం నుండి ఐదు రోజులపాటు జిల్లా పరిషత్ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఇంచార్జి సిఈఓ మోహన్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత జిల్లా స్థాయి అధికారులకు జిల్లా పరిషత్ చైర్ పర్సన్‌తో పాటు బ్లాకు మండల స్థాయి మాస్టర్ ట్రైనర్లు అయిన ఎంపిడివో, ఈఓపిఆర్డిలు పంచాయితీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు, డిజిటల్ అసిస్టెంట్లకు ఈ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ఒక రోజు ప్రజాప్రతినిధులకు ఇందుకు సంబంధించి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్న ఇన్చార్జి సిఈవో శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లు ఈ నెల 12 నుండి 16వ తేది వరకు మండల స్థాయిలో అక్కడి ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులకు శిక్షణ ఇస్తారన్నారు. రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి పంచాయితీరాజ్‌కు చెందిన అధికారులు ఈ శిక్షణ కార్యక్రమాలకు పరిశీలకులుగా వ్యవహరిస్తారన్నారు. గ్రామ, మండల జిల్లా పరిషత్ స్థాయిలో పంచాయితీలలో 2025 - 26 సంవత్సరానికి సంబంధించి ప్రణాళికలను తయారు చేయడం తద్వారా పంచాయితీల అభివృద్ధికి కావాల్సిన నిధులు విడుదలలో సమస్యలు రాకుండా అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్చార్జి సిఈవో పేర్కొన్నారు.

## నిర్దిష్ట గడువులోగా సమస్యల పరిష్కారం



**నెల్లూరు అర్బన్, నవంబర్ 4, ప్రభాతవార్త** ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే అర్జీలను వ్యక్తిగత శ్రద్ధ పెట్టి పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఇతర అధికారులతో కలిసి నిర్వహించి పలు సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజల నుండి వచ్చిన సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తున్న దృష్ట్యా అధికారులు ఆ దిశగా పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ముఖ్యంగా రి ఓపెన్ అవుతున్నటువంటి కేసులలో రెవెన్యూ అధికారులు అత్యంత జాగ్రత్తగా పరిష్కారం చూపాలన్నారు. పరిష్కారం చూపకుండానే ఆయా అర్జీలను మూసి వేయకూడదన్నారు. ఏదైనా సమస్య పరిష్కారం కాని సందర్భాలలో ఆయా అర్జీదారులతో వ్యక్తిగతంగా మాట్లాడి వివరించాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి అర్జీల పరిష్కరించడానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యల పరిష్కారానికి మానవీయ కోణంలో ఆలోచించి సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నించాలన్నారు. కాగా సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 339 అర్జీలు అందాయి. ఇందులో ఎక్కువగా రెవెన్యూకు సంబంధించి 127 అర్జీలు, మున్సిపల్ శాఖకు సంబంధించి 30, పంచాయితీ రాజ్‌కు సంబంధించి 51, పోలీసు శాఖకు సంబంధించి ఆరు అర్జీలు, సర్వే శాఖ 22 అర్జీలు, సెర్ప్ 19, పౌర సరఫరాల శాఖ 13 అర్జీలు వున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బధిరులు, అంధులకు జిల్లా కలెక్టర్‌చే మొబైల్ ఫోన్స్, లాప్ టాప్‌ల పంపిణీ జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బధిర, అంధ విద్యార్థిని విద్యార్థులకు మొత్తం 395000 రూపాయిల విలువ కలిగిన 10 మొబైల్ ఫోన్లు, 7 లాప్ టాప్‌లను విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అందజేశారు. బేటీ బచావో బేటీ పడావో టోల్ ఫ్రీ నంబర్ల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ జిల్లా



శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం అందజేస్తున్న వివిధ రకాల సేవలకు సంబంధించిన ఉచిత అత్యవసర హెల్ప్ లైన్ నంబర్ల వాల్ ఫోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ వాల్ పోస్టర్‌ను జిల్లాలోని ప్రతి అంగన్వాడి సెంటర్లలో విధిగా ప్రదర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఉదయభాస్కర్, జడ్పి ఇంచార్జి సిఈవో మోహన్ రావు, జిల్లా పంచాయితీ అధికారి శ్రీధర్ రెడ్డి, డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగరాజ కుమారి, డ్వామా పిడి గంగా భవాని, డిటిసి చందర్, ఐసిడిఎస్‌పిడి హేనా సుజన్, హౌసింగ్ పిడి వేణుగోపాల్, డిసిపిఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## కష్టాలను, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొని ఎమ్మెల్యేస్థాయికి ఎదిగా

### చదువుకున్న కాలేజీలోనే తనకు సన్మానం జరగడం ఎంతో సంతోషం!!

### కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి





**కావలి, నవంబర్04 ప్రభాతవార్త** కష్టాలను, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొని తాను ఎమ్మెల్యేస్థాయికి ఎదిగానని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. తాను చదువుకున్న, అధ్యాపకుడిగా బోధించిన కళాశాలలో తనకు సన్మానం జరగడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. కావలి జవహర్ భారతి డిగ్రీ కళాశాల యస్ఆర్ శంకరన్ హాల్‌లో సోమవారం ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డిని కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. అపూర్వ స్వాగతం పలికింది. తాను జవహర్‌భారతి డిగ్రీ కళాశాలలో చదువుకుని పి.జి చేశానన్నారు. ఇదే కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేశానన్నారు. తన తండ్రి డాక్టర్ చేయాలనుకుంటే అధ్యాపకుడిగా మారానన్నారు. ఆనాటి పరిస్థితులు ఎమ్మెల్యే దగుమాటి నెమరువేసుకుంటూ విద్యార్థులకు ఆసక్తి కలిగించేలా చేసిన ప్రసంగం అందరిని ఆకట్టుకుంది. ప్రతి విద్యార్థి కష్టంతో కాకుండా ఇష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలు అధిరోహించాలన్నారు. కావలి జవహర్‌భారతి కళాశాల తనకు విజ్ఞానంతోపాటు క్రమశిక్షణ నేర్పిందన్నారు. జీవితం అనేక మలుపులు సాగిందన్నారు. ఒక పారిశ్రామికవేత్తగా ఎదిగి ఎమ్మెల్యేగా మీముందుకు వచ్చానన్నారు. ప్రజలకు సేవచేయాలన్న తపనతో ఎమ్మెల్యేగా వచ్చానన్నారు. విశ్వోదయ విద్యా సంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ స్వర్గీయ దొడ్ల రామచంద్రారెడ్డి చేసిన కృషి చరిత్రలో నిలిచిపోయిందన్నారు. విద్యాదాతగా ఆయన నిలిచిపోయారన్నారు. భావితరాలకు చాటిచెప్పాలన్న ఉద్దేశంతో "ఐ లవ్ కావలి" ఐకాన్‌ను ఏర్పాటు చేశానన్నారు. తన జీవిత సోపానానికి బంగారుబాట వేసిన తన తండ్రి చేసిన కృషిని గుర్తుచేశారు. ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పడిన కష్టం చెప్పడంతో విద్యార్థులు ఎంతో ఆసక్తిని కనపర్చారు. జవహర్ భారతి కళాశాల రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి , కళాశాల యాజమాన్యం ఎమ్మెల్యే దగుమాటిని అపూర్వ స్వాగతం పలుకుతూ ఘనంగా సత్కరించారు. పూల మాలలతో, దుశ్శాలువాలతో ఎమ్మెల్యే ను ముంచెత్తి అభినందించారు. కరస్పాండెంట్ సుధాకర్‌రెడ్డి, రామ్‌సెంటర్ ఛైర్మన్ దొడ్ల మనోహ ర్‌రెడ్డి, డైరక్టర్ కూనం తాతిరెడ్డి, డాక్టర్ మాల్యాద్రి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట టిడిపి, జనసేన, బిజెపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డయేరియా ప్రబలకుండా జాగ్రత్తలు వహించండి : కమిషనర్ సూర్యతేజ





**నెల్లూరు కార్పొరేషన్,నవంబర్ 4,ప్రభాతవార్త:** కలుషిత తాగునీటి ప్రబలే డయేరియా పట్ల ప్రజలందరికీ అవగాహన పెంచి నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ హెల్ప్ లైన్ సహాయం తీసుకునేలా చర్యలు చేపట్టాలని కమిషనర్ సూర్యతేజ తెలిపారు.నెల్లూరు నగరపాలక సంస్థ వివిధ విభాగాల అధికారులు,సచివాలయం కార్యదర్శులతో కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో డయేరియా నివారణ తాగునీటి నాణ్యత అంశం పై సమీక్షా సమావేశాన్ని సోమ వారం నిర్వహించారు.ఈ సమీక్షా సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ కలుషిత తాగునీటి ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులైన దయేరియా,దోమల ద్వారా వ్యాపించే మలేరియా,టైఫాయిడ్,చికెన్ గున్యా, డెంగ్యూ ఇతర వ్యాధులను అరికట్టడానికి ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలను ప్రణాళికాబద్దంగా చేపట్టాలని సూచించారు. కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజనుల్లో ఇండ్ల చుట్టూ,ప్రాంగణాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకునే విధంగా గృహాల యజమానులకు అవగాహన కల్పించాలని,దీనికోసం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు.దోమల లార్వా ఎదుగుదలకు దోహదపడే మంచినీటి సరఫరాలో లీకేజీ ప్రాంతాలు,వాడి పడేసిన టైర్లలో నిల్వ ఉండే నీరు,బహిరంగ ప్రదేశాల్లో డంప్ చేసిన ఖాళీ కొబ్బరి బోండాలలో నిల్వ ఉండే వర్షపు నీరు,పూల కుండీలు,వాడకంలో లేని నీటి తొట్లు,బావుల పై ప్రజలందరికీ చైతన్యం కల్పించాలని సూచించారు. సూచించిన అన్ని అంశాల పై ప్రత్యేక దృష్టి సారించి దోమల ఎదుగుదలను నివారించే చర్యలు తీసుకోవాలని సూచించారు.వర్షాకాలంలో వాతావరణంలో చోటు చేసుకునే మార్పుల ఫలితంగా సీజనల్ వ్యాధ్యులతో పాటు విష జ్వరాలు ప్రబలే అవకాశం అధికంగా ఉంటుందని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు కాచి వడగాచిన నీటిని తీసుకోవాలనే అంశాల పై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు

**త్రాగునీటి నాణ్యత పరీక్షలు నిర్వహించాలి** ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ల నుంచి సరఫరా అవుతున్న తాగునీరు కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తులు తీసుకోవాలని,క్రమం తప్పకుండా సంబంధిత సచివాలయం కార్యదర్శులు తాగునీటి నాణ్యత పరీక్షలు నిర్వహించి, నివేఇకలను ఉన్నతాధికారులకు అందించాలని ఆదేశించారు. సచివాలయాల వారీగా కేటాయించిన ఫాగింగ్ మెషిన్లను ప్రణాళికాబద్ధంగా వినియోగించు కోవాలని, అవసరమైన అన్ని ప్రాంతాల్లో దోమల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.నగరపాలక సంస్థ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ నెంబర్లకు ప్రజలు సంప్రదించి అవసరమైన సహాయాన్ని పొందేలా ప్రచారం కల్పించాలని అదనపు కమిషనర్ వై.ఓ నందన్ అధికారులను ఆదేశించారు.ఈ సమీక్షలో యస్.ఈ.రామ్ మోహన్,ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య,అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ అధికారి జీజియా బాయి,ఇంజనీరింగ్,సచివాలయం అమెనిటీస్,శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులపై చట్టపరంగా న్యాయం



**నెల్లూరు క్రైం, నవంబర్ 4, ప్రభా తవార్త** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాద లపై విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తామని జిల్లా ఎస్పి జి. కృష్ణకాంత్ స్పష్టం చేశారు. సోమ వారం ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్ నందు నిర్వహించిన ఈ వేదిక ద్వారా స్వీక రించిన ఫిర్యాదులపై త్వరిగతిన స్పందించి, పరిష్కరిం చాలని పోలీ సు అధికారులను ఎస్పీ ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజా సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదిదారులతో ఎస్పి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సందర్భంగా ఎస్పి హామీ ఇచ్చారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక మొత్తం 103 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి (అడ్మిన్) సిహెచ్ సౌజన్య, డిఎస్పి గిరిధర్, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులు రెడ్డి, ఎస్‌బి 2 సిఐబి, శ్రీనివాస రెడ్డి, కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

## రీ సర్వేలో తప్పిదాలు,భూ కబ్జాలు,గిరిజలకు ఐటిడిఏ ద్వారా ప్రత్యేక గ్రీవెన్స్





**వెంకటాచలం నవంబర్ 4 ప్రభాతవార్త** గతంలో రీ సర్వే పేరుతో భూ కబ్జాలు రికార్డులో తారుమారు చేసిన పేదలకు సంబదించిన భూములకు తీవ్ర అన్యాయం జరిగిందిని,ఎక్కువ మంది పింఛన్ ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని అర్జీలు ఎక్కువగా వస్తున్నా యని పూర్తి స్థాయిలో విచారణ చేసి ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని సర్వేపల్లి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. వెంకటా చలంలో సోమవారం మండల పరిషత్ కార్యల యంలో ప్రత్యేక ప్రజా విజ్ఞాపనల కార్యక్రమానికి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గోన్నారు.అన్ని శాఖలదికారులతో ప్రతి ఒక్కరిని అర్జీని కంప్యూటర్ చేసి వారి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని సోమిరెడ్డి తెలిపారు.అనంతరం సోమిరెడ్డి మాట్లడుతూ వందలాది మంది అర్జీలతో బారులుదీరారంటే గత ప్రభుత్వం ప్రజల కోసం ఏ స్థాయిలో పని చేశారో అర్థమవుందన్నారు.అంగన్‌వాడి భవనాలు పాఠశాల భవనాలు, పూర్తి కాలేదన్నారు.ప్రతి గ్రామంలో సచివాలయ ఏర్పాటు చేసి శిబ్బందిని నియమించిన ఇన్ని సమస్యలు ఉన్నాయంటే ఎలా పని చేశారో అర్థం చేసుకోవచ్చునన్నారు. 2019 ముందు కట్టిన ఇళ్లకు బిల్లులు మంజూరు చేయకుండా దారుణంగా నిలిపి వేశారు. వైసిపి ఐదు ఏళ్ల పాలనలో ఒక్క కాలనీలో కూడ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయలేదు. ఈ కార్యక్రములో నెల్లూరు ఆర్డీవో నాగ సంతోష్‌ని యోజిక వర్గ ప్రత్యేకదికారి ఉషారాణి, తహశీల్దార్ శ్రీనివాసులు,ఎంపీడివో కల్పన, నాయకులు బోమ్మి సురేంద్ర నాగేంద్ర రాదాకృష్ణనాయుడు,అన్ని శాఖలది కారులు పాల్గోన్నారు.

**8న గిరిజల కోసం ప్రత్యేక గ్రీవెన్స్** ఈనెల 8న సర్వేపల్లి నియోజకవర్గంలోని ఐదు మండలాలోని గిరిజనల కోసం ఐటిడిఏ ద్వారా ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాని చెముదుగుంట వద్ద ఉన్న శ్రీడ్స్ కళ్యాణ మండపములో ఏర్పాటు చేయటం జరుగుతుందని ఐదు మండలలోని నాయకులు కార్యకర్తలు ప్రతి గిరిజన కుటుంబాని గ్రీవెన్స్ కార్యక్రమానికి హజరు కావాలని వారి సమస్యలను విన్నపించాలని తెలిపారు.



## ప్రకాశం జిల్లా రివ్యూ కమిటీ మీటింగ్‌లో పాల్గొన్న ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు



**కందుకూరు, నవంబర్ 4, ప్రభాతవార్త :** ఒంగోలులో జరిగిన జిల్లా రివ్యూ కమిటీ(డీఆర్‌సీ) సమావేశంలో ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు సోమవారం పాల్గొన్నారు. ఈ సమావేశంలో భాగంగా కందుకూరు నియోజకవర్గంను ప్రకాశం జిల్లాలో కలిపే అంశం, వలేటివారిపాలెం మండలం లోని మాలకొండ వద్ద ఏర్పాటు చేయదలచిన నిమ్జ్ ప్రాజెక్టుపై తీసుకుంటున్న చర్యలు, జిల్లాలో టూరిజం అభివృద్ధి చేయు ప్రాంతాల గురించి కొత్తపట్నం వద్ద విమానాశ్రయం ఏర్పాటు, ఇతర అంశాలపై ప్రసంగించారు.

## ఆహారం పంపిణీ చేసిన ఐఎఫ్‌సీ ఫౌండేషన్



**కందుకూరు, నవంబర్ 4, ప్రభాతవార్త :** ఆకలికి అందరూ బంధువులే అనే నినాదంతో కుల, మతాలకతీతంగా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా సోమవారం ఐఎఫ్‌సీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాత సహాయంతో పేదవారి కోసం కందుకూరు పట్టణంలో వృద్ధులు, పిల్లలను గుర్తించి వారికి ఆహారం, పండ్లు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా పేదవారికి సహాయం అందిస్తే సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని ఫౌండేషన్ సెక్రటరీ షంషీర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ సాజిద్, ట్రెజరర్ హఫీజ్, ఇన్‌ఛార్జ్ ఆయూబ్ ఖాన్ పఠాన్, షంషూద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## అర్జీలు పరిశీలించి పరిష్కరిస్తాం



**కొడవలూరు (విడవలూరు), నవంబర్ 4, ప్రభాతవార్త :** మండలం దామేగుంట గ్రామ సచివాలయంలో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు రీ సర్వే గ్రామ సభ కార్యక్రమం తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. గ్రామ సభకు వచ్చిన అర్జీలను వివాదాలకు తావు లేకుండా సమస్యలను పరిష్కరించాలని అధికారులను రైతులు వేడుకున్నారు. ఈ సందర్భంగా రీ సర్వే డిటి అరుణ్ కుమార్ మాట్లాడుతూ రీ సర్వేలో జరిగిన చిన్న చిన్న అవకతవకలు ఉంటే రైతులు ఇచ్చిన అర్జీలను పరిశీలించి సంబంధిత అధికారులకు తెలిపి పరిష్కారం చేయడం వివాదాలకు తావు లేకుండా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయన్ శ్రీలత, ఆర్ఐ సునీల్, వీఆర్వో సురేష్, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శివయ్య సన్నిదిలో కార్తీక దీపార్చన





**కలిగిరి, నవంబర్04, ప్రూభాతవార్త;** కార్తీక మాసం మొదటి సోమవారం శివయ్యకు ప్రత్యేకమైన రోజు. శివుని బక్తులకు పండుగరోజు. కార్తీమాసం కోసంఎంతగానో ఎదురు చూస్తున్న శివయ్య బక్తులు మొదటి సోమవారం కార్తీక దీపాలతో శివాలయంలో ధీపార్చన గావించారు. కలిగిరిలోని శ్రీ పర్వత వర్ధినీసమేత శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవారం ఘనంగా నిర్వహించారు. బక్తులు ఉదయం 5గంటలనుండే ఆలయంలో కార్తీక దీపాలు వెలిగించడం ప్రారంబించారు. సాయం సంధ్యా సమయంలో బక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం శివాల యంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ వేదపండితులు ఆదిత్యశర్మ ఆద్వర్యంలో బక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని శిద్ధనకొండూరు శ్రీ శిద్దేశ్వరాలయంలోని కొండపైకి బక్తులు విరివిగా తరలివెళ్లి కార్తీక దీపాలు వెలిగించారు.

## ఎస్ఎల్ఎస్ ఎంటర్‌ప్రైజెస్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే ఇంటూరి



కందుకూరు, నవంబర్ 4, ప్రభాతవార్త కందుకూరు పట్టణంలోని కనిగిరి రోడ్డులో ఎస్ఎల్ఎస్ ఎంటర్‌ప్రైజెస్‌ను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంటర్‌ప్రైజెస్ దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

## కందుకూరు పట్టణం సుందరయ్య నగర్ నందు ఉన్న సమస్యలు పరిష్కారించాలంటూ వినతి



కందుకూరు, నవంబర్ 4, ప్రభాతవార్త కందుకూరు సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమీషన్‌కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. కందుకూరు పట్టణం ఆరో వార్డు సుందరయ్య నగర్ నందు ఉన్న సమస్యలు పరిష్కరించాలని కందుకూరు మున్సిపల్ కమీషనర్‌తో సీపీఎం పట్టణ కార్యదర్శి ఎస్ఏ గౌస్ మాట్లాడుతూ కందుకూరు పట్టణానికి సమ్మర్ స్టోరేజ్ ఏర్పాటు చేయడం కోసం ఆ రోజు అక్కడ నివాసం ఉంటున్న పేదల ఇల్లు తొలగించి పక్కనే ఇళ్ల స్థలాలు ఇవ్వడం జరిగింది. రామతీర్ధ నుండి కందుకూరు పట్టణానికి పరిసర ప్రాంతాలకు పైపైలన్ ద్వారా మంచినీటి వసతి కల్పించారు. సమ్మర్ స్టోరేజీ ఆనుకొని పక్కనే ఉన్న సుందరయ్య నగర్ లింబినివనానికి మంచినీళ్ల పైపులైన్ గాని, కుళాయి కనెక్షన్ గాని కల్పించలేదు. సమ్మర్ స్టోరేజీ నిర్మాణం కోసం నివాసం ఉంటున్న ఇళ్లను తొలగించి పక్కనే ఇల్లు నిర్మించుకోమని స్థలం చూపించారు. ఆ సందర్భంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు మాట్లాడుతూ సుందరయ్య నగర్ కాలనీ మోడరన్ కాలనీ చేస్తామని అన్నారు. ఆచరణలో ఇప్పటివరకు మున్సిపాలిటీ ట్యాంకర్ ద్వారా చాలీచాలని నీళ్లు పంపిస్తున్నారు తప్ప శాశ్విత పరిష్కారం చేయడం లేదని అన్నారు. వీటితో పాటు పారిశుధ్య సమస్య అనేక సమస్యలు ఉన్నాయని, ఈ సమస్యల్ని తక్షణమే పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. కమీషనర్ మాట్లాడుతూ తక్షణమే మంచినీటి పైపులైన్ నిర్మాణం చేపడతామని తెలియజేశారు. మిగిలిన సమస్యలు కూడా పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. హామీ ఇచ్చిన మున్సిపల్ కమీషనర్‌కి సీపీఎం పట్టణ కమిటీ ధన్యవాదాలు తెలియజేసింది. ఈ కార్యక్రమలో సీపీఎం పట్టణ నాయకులు టి.వెంకటరావు, ఎస్‌కే మల్లిక, ఎం.పద్మ, ఎం.రాయుడు పాల్గొన్నారు.

## ప్రజలకు ఉచిత విద్యుత్ అందించేందుకే పియం సూర్య ఘర్‌ముఫ్త్ బిజిలి యోజన



**కావలి, నవంబర్ 4 ప్రభాతవార్త** ప్రజలకు ఉచిత విద్యుత్‌ను అందించేందుకే ప్రధానమంత్రి సూర్య ఘర్‌ముఫ్త్ బిజిలి యోజన పథకాన్ని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టాయని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. కావలి పట్టణంలోని స్పందన ఫంక్షన్‌హాల్‌లో సోమవారం విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే దగుమాటి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యేను విద్యుత్ అధికారులు స్వాగతంపలికి ఘనంగా సత్కరించారు. అక్కడ ఏర్పాటుచేసిన పలు సోలార్ ఏజెన్సి పరికరాల ప్రదర్శనను ఎమ్మెల్యే తిలకించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారులు విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించకపోవడంతో విద్యుత్‌శాఖ ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. విద్యుత్ భారాన్నుంచి ప్రజలను విముక్తి కల్గించేందుకే ఈ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. మనకు అందుబాటులో ఉన్న రామాయపట్నంలో 24కోట్లరూపాయలతో సోలార్‌ప్లాంట్ నిర్మిస్తున్నారన్నారు. సోలార్ వినియోగించడం వల్ల ప్రమాదాలతో పాటు కాలుష్యాన్నికూడా నివారించవచ్చునన్నారు. ప్రతి ఒక్కరూ సోలార్ ఏర్పాటు చేసుకుని ఉచిత కరెంటును పొందడంతోపాటు మీరు నిల్వచేసుకున్న కరెంటును ప్రభుత్వానికి అమ్ముకోవచ్చునన్నారు. ఈ సోలార్‌సిస్టమ్ బిగించుకునేందుకు



ప్రభుత్వం నుంచి 20శాతం సబ్సిడి లభిస్తుందన్నారు. అంతేకాకుండా సోలార్ కొనుగోలుదారులకు బ్యాంకులు 80శాతం రుణాలను మంజూరు చేస్తుందన్నారు. కావలి నియోజకవర్గ ప్రజలందరూకూడా ఉచితంగా విద్యుత్‌ను పొందాలనుకుంటే ప్రధానమంత్రి సూర్య ఘర్‌ముఫ్త్ బిజిలి యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కెయస్.బెనర్జి, డిఇ.రవికుమార్‌రెడ్డి, కలిగిరి డిఇ.కృష్ణమోహన్, కావలి ఎఇ.వసంతరావు, టిడిపి పట్టణాధ్యక్షులు గుత్తికొండ కిషోర్‌బాబు, ప్రధానకార్యదర్శి జ్యోతిబాబురావు, రాష్ట్ర కార్యదర్శి మాజీ ఎయంసి ఛైర్మన్ మలిశెట్టి వెంకటేశ్వర్లు, టిడిపి కావలి నియోజకవర్గ కన్వీనర్ గుంటుపల్లి రాజ్‌కుమార్‌చౌదరి, ఎగూరి చంద్రశేఖర్, మాజీ ఒడలాధ్యక్షుడు నాయుడు రామ్‌ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ఇసుక అక్రమ రవాణా

- చోద్యం చూస్తున్న సంబంధిత శాఖలు



**కోవూరు, నవంబర్ 4 ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వంలో మాదిరిగా కాకుండా ఇసుకను ఉచితం చేయడం ఇసుక మాఫియా అక్రమార్కులకు కలిసి వచ్చింది. గత ప్రభుత్వంలో ట్రాక్టర్ ఇసుక కొనాలంటే 3 వేల నుంచి 5 వేల వరకు ఉండేది. ప్రస్తుతం ఈ ప్రభుత్వం ఇసుకను పూర్తిగా ఉచితం చేయడంతో ఇసుక మాఫియాకు కలిసి వచ్చింది. ఈ మేరకు వారు పెన్నానది పరివాహక ప్రాంతాల నుంచి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తీసుకువచ్చి ఒక చోట డంప్ చేసి వాటిని రాత్రి వేళల్లో జేసీబీల ద్వారా టిప్పర్లకు లోడ్ చేసి బయట రాష్ట్రాలకు తరలించి తమ పబ్బం గడుపుకుంటున్నారు. కోవూరు మండలంలోని పలు ప్రాంతాల్లో ఈ ఇసుక మాఫియా దందా యథేచ్ఛగా కొనసాగుతూనే ఉంది. ఇటీవల కోవూరులోని జాతీయ రహదారి ఆటోమొబైల్ షోరూం వెనుక ప్రాంతంలో భారీ స్థాయిలో ఇసుక డంప్ చేసి అక్కడి నుంచి జేసీబీల ద్వారా టిప్పర్లకు లోడ్ చేస్తున్న సమాచారం రావడంతో కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ ఆ ప్రాంతానికి వెళ్లి జేసీబీని , రెండు టిప్పర్లను, ఒక ట్రాక్టర్‌ను సీజ్ చేసి కోవూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఒక వైపు ముఖ్యమంత్రి ఇసుక అక్రమ రవాణా చేసినా, వేరే రాష్ట్రాలకు తరలించినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేస్తున్నా ఇసుక మాఫియాలో మాత్రం ఇసుమంతైనా స్పందన రావడంలేదు. ఫలితంగా నెల్లూరు పెన్నా నది పరివాహక ప్రాంతం నుంచి రాత్రి వేళల్లో ఇసుక పక్క రాష్ట్రాలకు తరలివెళ్తూనే ఉంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ఇసుక మాఫియాపై ప్రత్యేక దృష్టి సారించి అక్రమ ఇసుక రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కేవలం పోలీస్‌శాఖ స్పందించినంత మాత్రాన ఈ ఇసుక మాఫియా ఆగదని, దీనికి రెవెన్యూ, పోలీస్, భూగర్భ గనుల శాఖ, సమిష్టిగా ఆకస్మిక దాడులు చేస్తే ఈ అక్రమ రవాణాను కొంతమేరనైనా అరికట్టవచ్చని స్థానికులు పేర్కొంటున్నారు.

## భూరికార్డుల విషయంలో అవకతవకలను పరిష్కరించాలి



**మర్రిపాడు, నవంబర్ 4 ప్రభాతవార్త:** మండలంలోని పంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న చిన్న, సన్నకారు రైతులు, పేదల భూములకు సంబంధించిన రికార్డుల విషయంలో ఉన్న అవకతవకలను పరిష్కరించాలని మండల తహసిల్దార్ అనిల్‌కు జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు శేషం సుదర్శన్ వినతిపత్రం అందజేశారు. ప్రతి నెలా చివరి వారంలో మండలంలోని ఒక్కో గ్రామ పంచాయతీలో పౌరహక్కుల దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలకు వారి హక్కుల పట్ల అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. మండల పరిధిలో అక్రమ మద్యం అమ్మకాలు, ఇసుక అక్రమరవాణా జోరుగా సాగుతున్నాయని వాటిని అరికట్టాలన్నారు.

## వివాహ వేడుకలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే మేకపాటి



మర్రిపాడు, నవంబర్4ప్రభాతవార్త: మర్రిపాడు మండలం పెగళ్ళపాడు వైసిపి నాయకుడు కత్తెరపల్లి కొండారెడ్డి-సులోచనమ్మ కుమారుడు మల్లిఖార్జునరెడ్డి వివాహ వేడుకలకు ఆత్మకూరు మాజీ శాసన సభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించారు. పెగళ్ళపాడులో జరిగిన వేడుకల్లో మర్రిపాడు మండల వైసిపి నాయకులు, కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాభినందనలు తెలిపారు.

## భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు







## కలెక్టర్‌కు కలిసిన వేగూరు సర్పంచ్



**కోవూరు, నవంబర్ 4 ప్రభాతవార్త :** కోవూరు మండలం వేగూరు పంచాయతీ గ్రామ సర్పంచ్ కరేటి అమరావతి సోమవారం జిల్లా కలెక్టర్ ఆనంద్‌ను బొకేతో కలిసి అభినందించారు. తమ పంచాయ తీలో కార్యదర్శి , సంక్షేమ సహా యకులు లేని కారణంగా ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్‌కు విన్నవించారు. అదే విధంగా వేగూరు పంచాయతీలో పలు అభివృద్ధికి సంబంధించిన సమస్యలు ఉన్నాయని వాటిపై చొరవ చూపాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించారని సర్పంచ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట టీడీపీ నాయకులు కరేటి శ్రీనివాసులు, వేగూరు సుబ్బానాయుడులు ఉన్నారు.

## నేడు సంయుక్త ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో వికలాంగులకు క్యాంప్

**పొదలకూరు, నవంబర్ 4, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వ సంస్థ సంయుక్త ప్రాతీయ కేంద్రం వారి ఆధ్వర్యంలో వికలాంగులకు క్యాంపు ఈ నెల 5వ తేది మంగళవారం ఉదయం 10 గంటలకు పొదలకూరు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ క్యాంపు నందు వికలాంగులు అర్హులైన వారికి మూడు చక్రాలు బండ్లు, వినికిడి యంత్రాలు, వీల్‌చైర్‌లు తదితర ఉపకరణాలు కొరకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. వికలాంగులు సదరం సర్టిఫికేట్, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, యుడిఐడి కార్డు తీసుకురావాలన్నారు. వయోవృద్ధులు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, 2 ఫోటోలు తీసుకురావాలని తెలిపారు.

## స్వంభూలింగేశ్వర స్వామికి పూజలు



**విడవలూరు, నవంబర్ 4, ప్రభాతవార్త :** మండల కేంద్రం యలగాలమ్మ గుంట మీద వెలసియున్న శ్రీ శాంభవి సహిత స్వంభూలింగేశ్వర స్వామికి మొదటి కార్తీక మాసం సోమవారం సందర్భంగా విశేష పూజ నిర్వహించారు. స్వామి వారికి ఉదయం తైలాభిషేకం, పాలాభిషేకం, పూల అలంకరణ అలంకరించడంతో స్వామివారు భక్తులకు పరమేశ్వర రూపంలో దర్శనమిచ్చారు. భజన భక్త మండల వారిచే భక్తి గీతాలు, భక్తులకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా సింహాద్రి సురేష్, ఆలయ సేవకులు వ్యవహరించారు.

## నిరక్షరాశులను అక్షరాసులుగా తీర్చిదిద్దాలి ఎంపిడివో నగేష్ కుమారి




**విడవలూరు, నవంబర్4, ప్రభా తవార్త :** మండల కేంద్రం సంఘ మిత్ర కార్యాలయంలో కేంద్ర ప్రభు త్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ కార్యక్ర మానికి ఎంపిడివో నగేష్ కుమారి పాల్గొని వివోఏలకు అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 19 సంవత్సరాల నుండి 45 లోపు వయసు ఉన్న నిరక్షరాసులను గుర్తించి అక్షరాసులుగా తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం ఏపిఎం బి. వెంకమ్మ మాట్లాడుతూ మండలంలో 42 మంది వివోఏలను 710 మంది నిరక్షరాస్యులకు శిక్షణ కార్యక్రమం ప్రభుత్వ అంగన్వాడి పాఠశాలలో శిక్షణ ఇవ్వడం త్వరలోనే జరుగుతుందన్నారు. అదే విధంగా సంఘమిత్ర గ్రూపుల్లో ఉన్న కొంతమంది లీడర్లు కూడా స్వచ్ఛందంగా నిరక్షరాస్యులకు బోధన కల్పించడం ముందుకు రావడం జరిగింది. ఒక వివోఏ పది మంది నిరక్షరాశులకు బోధన కల్పించి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఈ శిక్షణలో వివోఏలు నిరీక్షణ రాశులకు మంచి బోధన అందిస్తే వారిని గుర్తించి జిల్లా కలెక్టర్ ద్వారా గుర్తించి అవార్డులను పొందే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, మండల సంఘమిత్ర అధ్యక్షురాలు మహాలక్ష్మి శ్రీనివాస్, సిసిలు వెంకటేశ్వర్లు, శ్రీదేవి, మమత, సుకుమార్, శివకుమార్, చంద్రయ్య, అకౌంటెంట్ పద్మజ, వివోఏలు తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన తహాశీల్దార్ స్ఫూర్తి రెడ్డి



**విడవలూరు, నవంబర్ 4, ప్రభాతవార్త :** విడవలైనే తహాశీల్దార్ చంద్రశేఖర్ సెలవుపై వెళ్ళగా ఆయన స్థానంలో ఇన్చార్జి తహాశీల్దార్‌గా కె. స్ఫూర్తి రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల ప్రజానీకానికి అందుబాటులో ఉండి విధి నిర్వహణ అందించడం గ్రామాల్లో జరిగే సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

## కె.యడవల్లిలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



**అనుమసముద్రంపేట, నవంబర్4ప్రభాతవార్త:** ఏఎస్‌పేట మండలంలోని హసనాపురం, కావలి యడవల్లి గ్రామాల్లో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారాన్ని నిర్వహించారు. కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి జ్ఞాన వేదిక పొదలకూరు కమిటీ అధ్యక్షుడు పెంచలనరసయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీకమాసంలో దీపాలు వెలిగించడం అందులోని జ్ఞానం ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. ప్రమిద: మనిషి శరీరం మట్టితో సమానమని అందుకే మట్టి ప్రమిదల ను వాడేవారని, రెండు వత్తులు జీవాత్మ, ఆత్మల కలయికకు గుర్తు అని, వత్తులు వెలిగించే నిప్పు గురువు ఇచ్చే జ్ఞానానికి గుర్తు అని నూనె మనిషి జీవితానికి, జన్మకు కారణమైన కర్మను ఇక్కడ నూనెగా భావించాలన్నారు. దీపం వెలగడం గురువు ఇచ్చిన జ్ఞానాగ్ని ఆరిపోకుండా వెలిగేలా ఉండాలి అంటే జీవుడు ఆత్మతతో యోగం కావాలని అందుకే రెండు వత్తులను పెనవేసి ఉంచుతారన్నారు. రెండు వత్తులు కాలిపోవడమంటే ప్రమిదలో నూనె అయిపోయి రెండు వత్తులు కాలిపోయినప్పుడు మట్టి ప్రమాదిలను పారవేయాలి అంటే మనిషికి ఖర్మ అయిపోతే చనిపోతాడు. అలాగే యోగసాధన వలన యోగాగ్నిలో కర్మకాలిపోతే జీవాత్మ మోక్షం పొందుతుందని, మనిషి తల లో కర్మ అనే నూనె అయిపోతే ఇక జీవుడు ఆశరీరం విడిచి పెట్టాల్సిందేనన్నారు. ఈకార్యక్రమంలో బి.కృష్ణయ్య, ఎం.కొండయ్య, ఇ.పెంచలయ్య, ఇ.శేషాద్రి, పి.కిశోర్, పి.జాహ్నవి, వై.పెంచలయ్య, ఎం.సి.సుధాకరాచారి, టి.భాగ్యమ్మ, కె.కృష్ణయ్య, మురుగళ్ళ ఎం.పెంచలస్వామి, పి.గాయత్రిలు పాల్గొన్నారు.

## అత్తంటివారిపాలెంలో రెవిన్యూ గ్రామసభ




**వలేటివారిపాలెం నవంబరు 4, ప్రభాతవార్త :** భూసమస్యల పరిష్కారానికి సరియైన ధృవీకరణ పత్రాలు పొందుపరచాలని స్ధానిక తహసిల్దార్ అబ్దుల్ హమీద్ ప్రజలకు విజ్ఞప్తిచేశారు. సోమవారం రీసర్వేలో వచ్చిన సమస్యలపై పరిష్కారం నిమిత్తం నేకునా ఒపురంలో గ్రామసభ నిర్వహించారు. స్ధానిక వీఆరోవో మస్తాన్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో తహసిల్దార్ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సభలో పలువురు రైతులు పలు సమస్యలపై వినతి పత్రాలు అందచేశారు. ఈ సందర భంగా తహసిల్దార్ మాట్లాడుతూ భూసమస్యల సత్వర పరిష్కారానికి పూర్తి ఆదారాలు పొందుపరచాలన్నారు. ఇందుకు సంబందించిన సమాచారాన్ని భూరి కార్డులతో సరిచూసి సత్వరమే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రసాద్‌తోపాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## కావలి కలువనుంచి జలాలను విడుదల చేసిన కూటమి నేతలు



**జలదంకి, నవంబర్4, ప్రభాతవార్త:** చినక్రాక బాలన్సింగ్ రిజర్వార్ ఔట్‌ఫ్లోనుంచి కావలి కాలువకు అనుబందంగవున్న బ్రాహ్మణక్రాక మేజర్ కాలువకు సోమశిల జలాలను మండల కూటమి నేతలు సోమవారం విడుదల చేశారు. నేతలు తల్లపనేని మధునాయుడు, రామ కృష్ణారెడ్డి నిమ్మలపల్లి రామచైతన్య, చల్లా హను మారెడ్డి, కొల్ల రాధాకృష్ణ, కొర్రపాటి రామారావు, తోట మురళి, మాధవరావు, స్వర్ణ కొండపనాయుడు తదితరు లు కాలువ వద్దకు చేరుకొని గంగమ్మతల్లికి హారతినిచ్చారు. అనంతరం రైతులతో కలసి నీటిని క్రిందికి వదిలారు. ఈకాలువ కింద దాదాపు 3వేల ఎకరాలు సాగులోవుంది. ప్రస్తుతం నారుమడులు తదితర వ్యవసాయ పనులు మొదలైవున్నాయి. ఈదశలో సాగునీరు విడుదలకు చర్యలు తీసుకున్న నేతలు, అధికారులకు కర్షకలోకం ధన్యవాదాలు తెలిపారు.

## మొక్కలు వితరణ




**బిట్రగుంట, నవంబర్4, ప్రభాతవార్త:** బోగోలు మండలం విశ్వనాదరావుపేట పంచాయతిలోని జిల్లాపరిషత్ బాలుర, బాలికల ఉన్నతపాఠశాలలో సోమవారం అవార్డు సమస్త ఆధ్వర్యంలో శందాసిని సహకారంతో మొక్కల పంపిణి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగ పలు మొక్కల్ని పాఠశాలల ప్రాంగణంలో నాటించి మొక్కల పెంపకంవల్ల పర్యావరణ పరిరక్షణకు ఇవి ఎంతవరకు దోహదపడతాయొ విద్యార్దిని విద్యార్దులకు అవగాహన కలిగించారు. ఈసందర్భంగ బాలికల ఉన్నతపాఠశాల ప్రదానోపాద్యాయులు గంగాధర్‌రావు మాట్లాడుతు పర్యావరణ పరిరక్షణకు స్వచ్ఛంద సంస్థలు ముందుకురావడం ఎంతైన అభినందనీ యమన్నారు. ఈకార్యక్రమంలో అవార్డు ఆర్గనైజేషన్ నిర్వాహకురాలు గోవ శైలజ టీచర్స్ విద్యార్దిని విద్యార్దులు పాల్గొన్నారు.

## చిన్నారుల బరువు, ఎత్తు యాప్‌లో నమోదు చేయాలి



**కోవూరు, నవంబర్ 4 ప్రభాతవార్త :** ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్లు చిన్నారులకు ఆట పాటలతో కూడిన విద్యను అందించి నప్పుడే ఈ కేంద్రాల లక్ష్యం పూర్తిగా నెరవేరు తుందని కోవూరు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక తెలిపారు. కోవూరులోని శివాజీనగర్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో అంగన వాడీ కార్యకర్తలు ప్రతి నెల 10వ తేది లోగా ప్రతి చిన్నారి యొక్క ఎత్తు, బరువును తూచి సంబంధిత యాప్‌లో నమోదు చేయాలన్నారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భవతులకు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన పెంచేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆమె అంగన్‌వాడీ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు.

## విద్యుత్ నిలుపుదల

**నెల్లూరు, నవంబర్ 4, ప్రభాతవార్త-వైద్యం :** నగరంలోని 33/11 కేవీ వైఎంసీఏ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న 11 కేవీ కేబుల్ కలెక్టరేట్ ఫీడర్ నందు చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఆచారి వీధి, మధ్యపతి వారి వీధి, రాయాజి వీధి, ట్రంక్ రోడ్డు, యడ్లవారివీధి పరిసర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 1గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని, అత్యవసర విభాగం వారు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని నెల్లూరు టౌన్ డివిజన్ ఆపరేషన్ ఎం.శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## బేతనీయపేటలో విద్యుత్ స్తంభాలు, తీగలకు మరమ్మత్తులు



**బిట్రగుంట, నవంబర్04 ప్రభాతవార్త :** బోగోలు మండలంలోని బేతనీయపేటలో విద్యుత్‌స్తంభాలు తీగలకు మరమ్మత్తులు సోమవారం నిర్వహించారు. ఎన్నోసంవత్సరాలుగా విద్యుత్‌స్తంభాలు విరిగిపోయి, తీగలుతెగిపోయి విద్యుత్ అంతరాయం ఏర్పడుతుండటంతో స్థానిక నాయకులు సంజయ్ ప్రోద్బలంతో కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి సహకారంతో విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలను విద్యుత్‌శాఖ సిబ్బంది అమర్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## 5 వతేది నాగుల చవితి,6న ( నాగుల పంచమి)

**బుచ్చి నవంబర్ 4 ప్రభాతవార్త :** ఈ నెల 5 వతేది మంగళవారం నాగుల చవితి అని, 6 వ తేది నాగుల పంచమి అని అర్చకులు తెలియజేశారు. ఈ రెండు రోజుల మహిళలు భక్తి శ్రద్దలతో ఉపవాసాలు ఉండి పుట్టలో పాలు పోసి పూజలు చేస్తే అనారోగ్య సమస్యలు పోతాయని, సంతానం లేనివారికి సంతానం కలుగుతుందని, అలాగే వివాహం కాని వారికి వివాహాలు జరుగుతాయని, నాగదోషాలు తొలిగి పోతాయని అర్చకులు తెలియజేశారు. జంటనాగుల విగ్రహాలకు, శేషనాగు విగ్రహానికి అభిషేకాలు చేస్తే కాల సర్పదోషాలు తొలిగిపోతాయని, చక్కని ఆరోగ్యం కలుగుతుందని తెలిపారు. తరతరాలుగా వస్తున్న నాగదోషాలు తొలిగిపోతాయని వారు వివరించారు. మండలంలోని పుట్టలన్ని శుభ్రం చేసి మహిళలు దారలు కడుతు, పుట్టలన్ని కళకళలాడుతున్నాయి.

## మద్యం మత్తులో పెన్నానదిలోకి దిగి వ్యక్తి మృతి



**పొదలకూరు, నవంబర్ 4, ప్రభాతవార్త :** మద్యం తాగిన మత్తులో పెన్నానదిలోకి ఈతకు వెళ్లిన వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని సూరాయపాలెం వద్ద సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ హనీఫ్ తెలిసిన వివరాల ప్రకారం గ్రామంలోని ఎస్టీ కాలనీకు చెందిన ఆదిపూడి అంకయ్య (45) మద్యం సేవించి ఈత కోసం సూరాయపాలెం వద్ద పెన్నా నదిలోకి దిగి ప్రమాదవశాత్తు మృతి చెందాదున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## అర్జీలు పరిశీలించి పరిష్కరిస్తాం

**కొడవలూరు (విడవలూరు), నవంబర్ 4, ప్రభాతవార్త :** మండలం దామేగుంట గ్రామ సచివాలయంలో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు రీ సర్వే గ్రామ సభ కార్యక్రమం తహాశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. గ్రామ సభకు వచ్చిన అర్జీలను వివాదాలకు తావు లేకుండా సమస్యలను పరిష్కరించాలని అధికారులను రైతులు వేడుకున్నారు. ఈ సందర్భంగా రీ సర్వే డిటి అరుణ్ కుమార్ మాట్లాడుతూ రీ సర్వేలో జరిగిన చిన్న చిన్న అవకతవకలు ఉంటే రైతులు ఇచ్చిన అర్జీలను పరిశీలించి సంబంధిత అధికారులకు తెలిపి పరిష్కారం చేయడం వివాదాలకు తావు లేకుండా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీలత, ఆర్ఐ సునీల్, వీఆర్వో సురేష్, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దేవుడు ఆలస్యం చేయవచ్చు.. ప్రశాంతమ్మ చెయ్యదు అభివృద్ధి ప్రశాంతి రెడ్డికే సాధ్యం



**కొడవలూరు (విడవలూరు), నవంబర్ 4, ప్రభాతవార్త :** కోవూరు నియోజకవర్గ ప్రజలు మనసుల్లో మహిళను ఎన్నుకొని ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించి ప్రజల మనసుల్లో శిరస్థాయిగా నిలచిపోయే మహిళా సింహం కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని కొడవలూరు టిడిపి నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ఏ అవసరం వచ్చిన ఎమ్మెల్యేకు తెలిపిన వెంటనే స్పందించి పరిష్కారం చేసే ఒకే ఒక్క ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిని కొనియాడారు. కొన్నాళ్ల నుండి కొడవలూరు పంచాయితీ, రైల్వే గేట్ దగ్గర నుండి గుంతల రోడ్డుతో వాహనదారులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి రోడ్డు మరమ్మత్తులకు వెంటనే పనులు ప్రారంభం చేయడం సంతోషకర విషయం అని తెలిపారు. పోలేరమ్మ గుడికి నిర్మాణం ఏర్పాటుకు ఎమ్మెల్యేను కోరగా టిటిడిలో గుడి అభివృద్ధి గురించి మాట్లాడుతామని తద్వారా గుడి పూర్తి చేయడం జరుగుతుందని హామీ ఇచ్చిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలపై ప్రజలు కోరిన వెంటనే చొరవ చూపిన నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే ముంగమూరు శ్రీహరి రెడ్డి, జీవన్ శేఖర్ రెడ్డిలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నక్క రమణయ్య, అంబటి విజయ్ కుమార్, కోవూరు వెంకీ, చల్లా సురేష్, సుశాంత్, శ్రీనివాస యాదవ్, శివకుమార్, అశోక్, పూజారి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## అల్లిపురం టిడ్కో ఇండ్ల మధ్యలో పారిశుధ్యం,విధి లైట్ల లోపం



**నెల్లూరు కార్పొరేషన్, నవంబర్ 04, ప్రభాతవార్త:** నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని రూరల్ నియోజక వర్గం ప్రాంతం అయిన అల్లిపురం టిట్కో ఇళ్లలో నివాసముంటున్న వారంద రికిని వీధిలైట్లు లేక పారిశుద్ధ్యం చేయక చాలా ఇబ్బందులు పడుతు న్నామని గిరిజనులు సంక్షేమ సంఘ ం జిల్లా చైర్మన్ బి ఎల్ శేఖర్ సోమవా రం మేయర్ స్రవంతికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా ప్రాంతంలో రాత్రి పగలు తేడా లేకుండా మద్యం బాబులు విచ్చల విడిగా చేస్తున్నారని, ఇండ్ల సముదాయానికి వెనుక వైపు అల్లింపురం మేకల వారి తోట వద్ద లాకుల వద్ద నుంచి సముదాయంలోకి వెళ్లే రహదారి మూసి వేయటం పలు సమస్యల పై ఇళ్లలో నివాసం ఉంటున్న వారందరును చాలా ఇబ్బందులు పడుతూ మున్సిప్ అధికారులకి కొంతమంది ప్రజా ప్రతినిధులకు తెలిపిన సరైన స్పందన లేనందున నెల్లూరు నగర మేయర్ పొట్లూరు స్రవంతి జయవర్దన్ లిఖితపూర్వకంగా సమస్యల పై వినతి పత్రం అందజేసి వివరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యులు చౌటురు శ్రీనివాసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు గంధర్ల శ్రీరాములు, కొంతమంది నివాసులు పాల్గొన్నారు.

## ఉల్లాస్ కార్యక్రమంపై శిక్షణ

**వింజమూరు, నవంబర్4ప్రభాతవార్త:** వింజమూరు మండల సమైక్య వెలుగు కార్యాలయంలో వయోజనుల్లో నిరక్షరాస్యత నిర్మూలనకై కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఉల్లాస్ కార్యక్రమంపై సోమవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి 23గ్రామ సంఘాల నుండి ఇద్దరు చొప్పున ట్రైనింగ్ ఇచ్చే టీచర్లను గుర్తించి శిక్షణ అందించారు. ఎంపిడిఓ శ్రీనివాసులురెడ్డి ఉల్లాస్ శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతూ కార్యక్రమాన్ని శిక్షణ పొందిన టీచర్లు విజయవంతం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంఇఓ మధుసూధన్‌రెడ్డి, అడల్ట్ ఎడ్యుకేషన్ సూపర్‌వైజర్ ఎస్.కె.బాదుల్లా , ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు సుజాత, షకీల, ఎపిఎం పి.వి.కృష్ణారావ్, సిసిలు సుశీల, విజయమ్మ, కె.సురేష్, మండల సమైక్య అధ్యక్షురాలు ఎస్తేరమ్మ, కార్యదర్శి బుజ్జమ్మ, సమైక్య సభ్యులు పాల్గొన్నారు.

## సచివాలయ ఉద్యోగులకు రివ్యూ సమావేశం



**విడవలూరు, నవంబర్ 4, ప్రభాతవార్త :** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎస్టీలకు ఆధార్ గుర్తింపు నమోదు ఈ కార్య క్రమంలో భాగంగా సోమవారం సచివాలయ ఉద్యోగులకు రివ్యూ సమావేశం ఎంపిడివో నగేష్ కుమారి నిర్వహించారు. ఈ సందర్భ ంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఎంతో మంది ఎస్టీలు ప్రభుత్వం నుండి వచ్చే పథకాలను కోల్పోతున్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఎస్టీలను గుర్తించి ఆధార్ కార్డు పొందే విధంగా కృషి చేయాలని సూచించారు. ఒకవేళ ఎస్టీల వద్ద ఆధార్ కొరకు పత్రాలు లేకుంటే పంచాయితీ నుండి ఎన్ఓసి ఇచ్చి తర్వాత చేయాల్సి న ప్రణాళికను పూర్తి చేసి ఎస్టీలకు ఆధార్ పొందే విధంగా అందరూ బాధ్యత తీసుకోవాలన్నారు.

## గ్రామ సభకు రైతులు తప్పనిసరి

**విడవలూరు, నవంబర్ 4, ప్రభాతవార్త :** జిల్లా అధికారుల ఆదేశాల మేరకు జరుగుతున్న రీ సర్వే గ్రామ సభ కార్యక్రమం మండలం చౌకచర్ల గ్రామంలో గ్రామ సచివాలయంలో జరుగుతున్నట్లు ఇన్చార్జి తహశీల్దార్ స్ఫూర్తి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్క రైతు రీ సర్వేలో జరిగిన భూ సమస్యలు అవకతవకలు ఉంటే గ్రామ సభలో తెలిపి తద్వారా పరిష్కారం చేసుకోవాలన్నారు.

## మాజీ మంత్రిని కలిసిన ఎంపిపి జ్యోతి



**కొడవలూరు (విడవలూరు), నవంబర్ 4, ప్రభాతవార్త :** రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి నియమించడంతో ఆయన నివాసంలో డిసిఎంఎస్ మాజీ చైర్మన్ వీర చలపతిరావుతో కొడవలూరు మండల ఎంపిపి గాలి జ్యోతి మర్యాద పూర్వకంగా కలసి పూల మొక్కని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి నాయకులు గాలి సునీల్, రామిరెడ్డి రాజేష్, రెడ్డి, పందిటి సాకేష్ రెడ్డి, మిదమలూరు విశ్వతేజ, తోకల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## అపార్ నమోదు వేగవంతం చేయాలి



**కోవూరు, నవంబర్ 4 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని ప్రభుత్వ , ప్రైవేట్ పాఠశాలలు అపార్‌కు సంబ ంధించిన డాక్యుమెంటేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన సంబంధిత పాఠ శాల ప్రధానోపాధ్యాయులు, కరస్పాం డెంట్‌లకు సూచించారు. ఈ మేరకు సోమవారం ఆయన మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సంబంధించిన ఆధార్ ఏమైనా తప్పు ఒప్పులు ఉంటే వాటిని పూర్తిగా సరిచేసుకుని అపార్‌కు సంబంధించి అప్‌లోడ్ చేసే కార్యక్రమాన్ని పారదర్శకంగా చేపట్టాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

## విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు



**బుచ్చి నవంబర్ 4 ప్రభాతవార్త** విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపిడిఒ శ్రీహరి, ఇఒపిఆర్‌డి నారాయణరెడ్డి హెచ్చరించారు. ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయితీ సెక్రట రీలతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన వారికి పలు సూచనలు చేశారు .ప్రతి పంచాయితీలో క్రమం తప్పకుండా క్లోరినేషన్ చేయాలని సూచించారు. అలాగే దోమలు లేకుండా చేసేందుకు ఫాగింగ్ చేయాలని అన్నారు. గ్రామంలో చెత్తను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని చెప్పారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలోని సెక్రటరీలు పాల్గోన్నారు.

## అక్రమ ఇసుక టిప్పర్లు పట్టివేత



**ఉలవపాడు, నవంబర్ 4, ప్రభాతవార్త** ఎటువంటి అనుమ తులు లేకుండా ఇతరులు తరలిస్తున్న మూడు టిప్పర్లను గుర్తించి సోమవారం తెల్లవారుజామున రాజుపాలెం జంక్షన్ వద్ద అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై కే.అంకమ్మ తెలిపారు. టిప్పర్లు నెల్లూరు వైపు నుండి ఒంగోలు వైపు వెళ్తున్నట్లు తెలియజేశారు. ఎటువంటి డాక్యుమెంట్లు లేకుండా ఇసుకను రవాణా చేస్తున్నట్లు గుర్తించి వాటిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. తదుపరి చర్యలు నిమిత్తం వాటిని ఏడీ మైన్స్ ఒంగోలు వారికి వ్రాతపూర్వకంగా తెలియపరిచినట్లు ఎస్సై అంకమ్మ తెలిపారు.

## ఎమ్మెల్యేని కలిసిన కొడవలూరు టిడిపి నాయకులు



**కొడవలూరు (విడవలూరు), నవంబర్ 4, ప్రభాతవార్త** టిటిడి దేవస్థానం పాలక మండల సభ్యులుగా ఎన్నికైన కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి నివాసంలో కొడవలూరు టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు కప్పి ఘన సన్మానం చేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నక్క రమణయ్య, అంబటి విజయ్ కుమార్, కోవూరు వెంకీ, చల్లా సురేష్, సుశాంత్ శ్రీనివాస యాదవ్, శివకుమార్, అశోక్, పూజారి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా కార్తీక్ మాస పూజలు



**విడవలూరు, నవంబర్ 4, ప్రభాతవార్త** మండల కేంద్రం శివాల యంలో కార్తీక మాసం సందర్భంగా స్వామి వారికి ఉదయం అభిషేకం, కంకుమార్చన, జ్యోతి దీపారాధన అత్యంత వైభవంగా చేయడంతో భక్తులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. మహిళలు, అయ్యప్ప భక్తులు కార్తీకదీపాలతో శివాలయంలో వెలుగు నింపారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదం పంచిపెట్టారు.

## అనీల్‌బాబును పరామర్శించిన మాజీ మంత్రి ప్రసన్న



**బుచ్చి నవంబర్ 4 ప్రభాతవార్త** రాష్ట్ర మాజీ ఆఫ్కాస్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు తండ్రి కొండూరు గోవిందయ్య ఇటీవల మృతి చెందారు. ఈవిషయం తెలుసుకున్న మాజీ మంత్రి,వైసిపి అధికారప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అల్లూరు మండలం ఇస్కపల్లి పంచాయితీ సంభునిపాళెంలోని అనీల్‌బాబు నివాసానికి వెళ్ళి ఆయన కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢసానుభూతిని తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట నెల్లూరు డిసిఎంఎస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి, విడవలూరు మండల అధ్యక్షులు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, పొన్నాల కృష్ణారెడ్డి, దంపూరు సర్పంచ్ ఇనగంటి సురేంద్రరెడ్డి, పంచమూర్తి నారాయణ ఉపసర్పంచ్ నాగేళ్ళ శీనయ్య తదితరులున్నారు.

## సోమవారం శివాలయానికి పోటెత్తిన భక్తులు



**కోవూరు, నవంబరు 20 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీపార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కామాక్షి సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో కార్తీక మాసంలో వచ్చే ప్రథమ సోమవారం సందర్భంగా ప్రాత:కాలమునే ఆలయంలో స్వామివారికి ప్రధాన అర్చకులు సుబ్బరామయ్య ఆధ్వర్యంలో అభిషేక పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. న. చుట్టుపక్కల గ్రామాల నుంచి మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించి పూజలు నిర్వహించుకున్నారు.



## పొదలకూరు నూతన సిఐగా శివరామకృష్ణ రెడ్డి నేడు బాధ్యతలు స్వీకరణ




పొదలకూరు, నవంబర్ 4, ప్రభాతవార్తపొదలకూరు నూతన సిఐగా శివరామకృష్ణారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న రాంబాబు వీఆర్‌కి వెళ్లడంతో ఆయన స్థానంలో రామకృష్ణారెడ్డి విధులకు హాజరైయ్యారు. శివరామకృష్ణారెడ్డి గతంలో పొదలకూరు స్టేషన్‌లో సిఐగా నిధులు నిర్వహించడంతో పొదలకూరు వాసులకు ఆయన సుపరిచితమే. గుంటూరు రేంజ్ విఆర్‌లో ఉన్న రామకృష్ణారెడ్డి బదిలీపై పొదలకూరు వచ్చారు. ఈసందర్భంగా ఎస్‌ఐ హనీఫ్ స్టేషన్ సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు.

## దివ్యాంగుల సమస్యలను పరిష్కరించండి



**నెల్లూరు అర్బన్, నవంబర్ 4, ప్రభాతవార్త** సోమవారం, కలెక్టర్ కార్యాలయంలోని జరుగుతున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లాలో దివ్యాంగులు పడుతున్న ఇబ్బందుల మీద కూనపురెడ్డి అరుణ, గూడూరు వెంకటరమణయ్య, చిట్టి కుమార్, మందా సుకుమార్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. తక్షణమే శాశ్వత దివ్యాంగుల సంక్షేమ శాఖ, ఏడిని నియమించాలని కోరారు. దివ్యాంగుల కో ఆపరేటివ్ కార్పొరేషన్‌కు ప్రభుత్వం నిధులు విడుదల చేసిన కూడా జిల్లా అధికారులు కాలయాపన చేస్తున్నారని కోరారు. ఎన్‌హెచ్‌ఎఫ్‌డిసి పథకంలో దివ్యాంగులకు బ్యాంకుతో సంబంధం లేకుండా రుణాల మంజూరు చేయాలని ప్రభుత్వ ఉద్యోగుల షూరిటీని మినహాయింపు చేయాలని కోరారు. ఈ సమస్యలను ప్రత్యేకంగా పరిశీలించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆవుల నాగేంద్ర పోలిచెర్ల కృష్ణ, గోపి, దేవసేనమ్మ, శ్రీనివాసులు జకావుల్లా, షాకీర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూముల రీసర్వే లోపాలపై ప్రత్యేక దృష్టి చూపాలి



**నెల్లూరు అర్బన్, నవంబర్ 4, ప్రభాతవార్త** గత ప్రభుత్వంలో జరిగిన భూముల రిసర్వే లోపాలపై ప్రత్యేక దృష్టి చూపాలని నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్‌ని కలిసి వినతి పత్రం అందజేసారు. న్యాయవాది ఏపి బిసి అడ్వకేట్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఇర్ల వెంకటరమణయ్య, ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా జాయింట్ కలెక్టర్ కార్తీక్‌కి వినతి పత్రం అందజేస్తూ గత ప్రభుత్వంలో జరిగిన ల్యాండ్ రిసర్వేలో జరిగిన లోపాలను గుర్తించి అర్జీదారుల సమస్యలపై త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

## విఎస్‌యూలో ఎస్‌పి ఎస్ఎస్ డేటా విశ్లేషణ



**వెంకటాచలం నవంబర్ 4 ప్రభాతవార్త** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో వ్యాపార నిర్వహణ విభాగం ఆద్వర్యంలో ఎస్‌పి ఎస్ఎస్ విశ్లేషణ డేటా అనే అంశంపై వారంలో పాటు ప్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈకార్యక్రమానికి విఎస్‌యూ ఉపకులపతి ఆచార్య విజయభాస్కర్, రిజిస్ట్రార్ సునీత, బెంగూళూరు నుండి డాక్టర్ సిహెచ్ రాజ్ కమల్ పాల్గోన్నారు. వీసి మాట్లడుతూ ప్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ అదునిక డేటా విశ్లేషణ పద్దతులు నేర్చుకోవడంలో కీలకమైనది అన్నారు. ఎస్‌పి ఎస్ఎస్ సాఫ్ట్‌వేర్‌లతో విద్యార్దులు మరియు, అద్యాపకులు పరిశోధన మరింత లోతైన అవగాహన కలిగి సమచారాన్ని సమర్దవంతగా విశ్లేషించగలరు. డేటా అదారిత నిర్ణయాలు తీసుకోవడం విద్యా రంగములో ,వ్యాపార రంగములో అత్యంత ముఖ్యం అన్నారు. విద్యార్దులు డేటా విశ్లేషణ పొందడంతో మేరుగైన పలితాలు ఆదించ వచ్చుననన్నారు. రిజి స్ట్రార్ మాట్లడుతూ డేటా విశ్లేషణ ద్వారా ఉన్నత స్దాయి నైపుణ్యాబివృద్ది చేయడంలో ఎంతో ఉపయోగపడుతాయన్నారు. రాజ్ కమల్ మాట్లడుతూ ఎస్‌పి ఎస్ఎస్ అన్వేషణ డేటా ఎంట్రీ ప్రాముఖ్యతంగా గురించి పూర్తిగా వివరించారు. రాజ్ కమల్‌ను వీసి ,రిజిస్ట్రార్ సన్మానించి అబీనందించారు. ఈ కార్యక్రములో ప్రిన్సిపాల్ సిహెచ్ విజయ, విభాగ అదిపతి సాయి శ్రవంతి, కోర్డినేటర్ చెంచురెడ్డి విజేత, విజయ, మదుమతి, తదితరులు పాల్గోన్నారు.

## కరాటేలో అత్యంత ప్రతిభ కనబరిచిన ముతహర్




**కోవూరు, నవంబర్ 4 ప్రభాతవార్త :** కోవూరుకు చెందిన ఎస్కే ముతహర్ విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో నవంబర్ 3వ తేది జరిగిన 23వ నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి కోవూరుకు మంచి పేరు తీసుకువచ్చారు. కాటా విభాగంలో మొదటి స్థానం, కుమితి విభాగంలో ద్వితీయ స్థానం సాధించి నిర్వాహకుల చేతుల మీదుగా వెండికప్పులు, సర్టిఫికెట్లు స్వీకరించారు. ఈ సందర్భంగా ముతహర్ మాట్లాడుతూ తమ కోచ్ జి. రాజేష్ ఇచ్చిన ప్రోత్సాహంతో పాటు పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ పలు సూచనలు ఇచ్చారని, వారు ఇచ్చిన ప్రోత్సాహంతో ఆదివారం జరిగిన ఈ కరాటే పోటీల్లో రెండు విభాగాల్లో ప్రతిభ కనబరిచి అతిథులు చేత మన్ననలు కూడా పొందాననన్నారు. తనకు మంచి ప్రోత్సాహం ఇస్తే జాతీయ స్థాయిలో కూడా కరాటేలో మంచి పతకాలు సాధిస్తానని ఈ సందర్భంగా ముతహర్ ధీమా వ్యక్తం చేశారు.

## బియ్యం లోడ్‌ను పరిశీలించిన అధికారులు



**కోవూరు, నవంబర్ 4 ప్రభాతవార్త :** కోవూరులోని జాతీయ రహదారి ఇనమడుగు సెంటర్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున రాబడిన సమాచారం మేరకు సీఎస్‌డీటీ బాలకోటమ్మ, కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్‌లు సింగరాయకొండ నుంచి కోవూరు వైపు వస్తున్న బియ్యం లోడ్ లారీని ఆపి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా లారీలో ఉన్న బియ్యాన్ని కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి, సివిల్ సప్లయిస్ శాఖ అధికారులు , సీఎస్‌డీటీ బాలకోటమ్మలు నిశిత పరిశీలిన చేపట్టారు. ఇవి రేషన్ బియ్యం కాదని, డీలర్లు రైస్ మిల్లులో ఆడించి పంపినవని ఈ సందర్భంగా పరిశీలనలో వెల్లడైందని సీఎస్‌డీటీ తెలిపారు. మొత్తం మీద లారీ ఆపడం, తనిఖీలు చేసి పంపడం చర్చనీయాంశమైంది.

## శ్రీఅయ్యప్ప స్వామి అన్న ప్రసాద భవనానికి రూ.1,00,116లు విరాళం



**కందుకూరు, నవంబర్ 4, ప్రభాతవార్త** కందుకూరు పట్టణంలోని కనిగిరి రోడ్డు నందు ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి ఆలయం ఆవరణ వెనుక భాగంలో శ్రీ అయ్యప్ప స్వామి సేవా సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ అయ్యప్ప స్వామి అన్న ప్రసాద భవనానికి ఎర్రారెడ్డిపాలెం గ్రామానికి చెందిన రాజారపు మాల కొండయ్య ధర్మపత్ని పావని రూ. 1,00,116 లు కమిటీ సభ్యులకు విరాళం అందజేశారు. ఈసందర్భంగా అయ్యప్ప స్వామి సేవా సంఘం సభ్యులు మాట్లాడుతూ శ్రీ అయ్యప్ప స్వామి అన్న ప్రసాద భవనానికి సహకారం అందించిన ప్రతి ఒక్కరికి వారి కుటుంబ సభ్యులకు హరిహర పుత్ర అయ్యప్ప స్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ అయ్యప్ప స్వామి సేవా సంఘం సభ్యులు గురు స్వామి, కేఎస్ వెంకటేశ్వర్లు, ఇస్కాల వెంకట నరసింహా, నల్లబోతుల మురళి, మాదాల వెంకటేశ్వర్లు, కాటా చెంచురామయ్య, దాసరి శ్రీనివాసరావు, ఉన్నం వీరాస్వామి, మాదాల నర్సింగరావు పాల్గొన్నారు.

## ప్రయోజనం లేని కాలువతో ప్రజల అవస్థలు







వింజమూరు, నవంబర్4ప్రభాతవార్త: వింజమూరు పట్టణంలో లక్షలాది రూపాయలు వెచ్చించి పలు చోట్ల నిర్మించిన సైడు కాలువలు ప్రజలకు ప్రయోజనకరంగా లేకపోగా మురుగునీటితో సహవాసం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని పంచాయతీ పాలకులు ధనార్జనే ధ్యేయంగా కాలువలను నిర్మించడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని సొసైటీ మాజీ చైర్మెన్ జూపల్లి రాజారావ్ ఆరోపించారు. వింజమూరు స్టేట్ బ్యాంక్ వెనుకప్రాంతం, పాతూరు , మరికొన్ని ప్రాంతాల్లో పంచాయతీ పాలకులు నిర్మించిన కాలువలు నిర్వహణ సక్రమంగా లేక మురుగునీరు పారక పోవడంతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. పారిశుధ్య నిర్వహణ, మురుగునీరు కాలువలు శుభ్రపరచడం, పరిశుభ్రమైన తాగునీటిని సరఫరా చేయడం తదితర విషయాలపై పంచాయతీ పాలకులు దృష్టిసారించడం లేదన్నారు. మురుగునీటితో నివసించాల్సి వస్తుందన్నారు. ఆప్రాంతం మొత్తం కంపుకంపుగా ఉందన్నారు. ఎన్ని దపాలు అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా చేతులెత్తేశారన్నారు. వర్షాకాలం ప్రారంభమైందని, సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం మెండుగా ఉందన్నారు. పారిశుధ్యంపై ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు చేపట్టి పారిశుధ్యాన్ని పారద్రోలాల్సిన అవసరం ఉందన్నారు. లక్షలాది రూపాయలు దుర్వినియోగమయ్యాయే తప్ప ఎక్కడా సైడు కాలువలు ప్రయోజనకరంగా లేవన్నారు. పంచాయతీ పాలనపై , నిధుల దుర్వినియోగంపై పలువురు స్థానిక ప్రజా ప్రతినిధులు జిల్లా ఉన్నతా ధికారుల దృష్టికి తీసుకెళ్ళినా ప్రయోజనం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. ఈవిషయంపై సర్పంచ్‌ను వివరణ కోరగా పంచాయతీ పరిధిలోని జరిగిన అభివృద్ధి పనులు అధికారుల పర్యవేక్షణలో జరిగాయే తప్ప తమ ఇష్టానుసారం చేయలేదన్నారు. కొన్ని చోట్ల చేసిన పనులకు ఇప్పటికీ బిల్లులు రానీయకుండా కొంతమంది అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఆరోపణలు నిజమైతే విచారణకు తాము సిద్ధమేనన్నారు.

## రీ సర్వేను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలి




**కోవూరు, నవంబర్ 4 ప్రభాతవార్త :** మండలంలోని గ్రామాల్లో నిర్వహిస్తున్న రీ సర్వే గ్రామ సభలను సంబంధిత గ్రామాలకు సంబంధించిన రైతులకు ఎంతో ఉపయోగకరమని , ఈ గ్రామ సభలను వారు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నిర్మలానందబాబా అన్నారు. కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో సోమవారం రీ సర్వే గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామ సభలో రైతులు తమ పొలాలకు సంబంధించిన మార్పులు, చేర్పులు తదితర విషయాలు ఉంటే వాటిని అర్జీ రూపంలో గ్రామ సభకు అందజేయాలన్నారు. అనంతరం వాటిని నిశితంగా పరిశీలించి సంబంధిత రైతులకు న్యాయం చేసేలా చూస్తామన్నారు. ఈ సందర్భంగా ఈ గ్రామ సభకు 47 అర్జీలను రైతుల నుంచి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీఐవో సత్యనారాయణరెడ్డి, మండల సర్వేయర్ రమేష్ గౌడ్, గ్రామ సర్పంచ్ దామెర్ల ప్రమీలమ్మ, ఎంపీటీసీ సభ్యులు కొల్లారెడ్డి సునీల్‌కుమార్ రెడ్డి, గ్రామ రెవెన్యూ అధికారి జగదీష్, తదితరులు ఉన్నారు.

## సాంప్రదాయబద్దంగాపూజలు



**కోవూరు, నవంబర్ 4 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న కామాక్షి సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో కార్తీక మాస మొదటి సోమవారం సందర్భంగా ప్రాత:కాలమునే స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథం సుబ్బరామయ్య అభిషేక పూజలను సాంప్రదాయబద్దంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుద్దీపాలతో అత్యంత వైభవంగా అలంకరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, విజ యలక్ష్మి దంపతులు ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. రుత్వికులు శేఖర్ స్వామి, నాగరాజు, వంశీ, ఉన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు



**కావలి, నవంబర్4 ప్రభాతవార్త** కార్తీకమాసం తొలి సోమవారం కావడంతో భక్తులతో శివాలయాలు పోటెత్తాయి. కావలి పట్టణంలోని శ్రీదుర్గా భ్రమరాంబసమేత మల్లేశ్వరస్వామి (కావలి శివాలయం) ఆలయంలో భక్తులు తెల్లవారుజామునుంచి రాత్రి వరకు క్యూద్వారా పార్వతిపరమేశ్వరులను దర్శించు కున్నారు. ఆలయ అనువంశిక అర్చకులు ఎఆర్.శశిధర్ గురుకుల్ భక్తులకు సౌకర్యాలు కల్పించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో కార్తీకదీపాలు వెలిగించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. కావలి పట్టణ, రూరల్ ప్రాంతాలలోని శివాలయాల్లో భక్తులు తొలికార్తీక సోమవారంనాడు ఒక్కపొద్దులు ఉండి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

## శ్రీ అయ్యప్ప స్వామి మాలధారణ స్వాములకు నూతన వస్త్రాలు, నూతన మాలలు అందజేత



**కందుకూరు, నవంబర్ 4, ప్రభాతవార్త** అయ్యప్ప స్వామి మాల ధారణ భక్తులకు ఎంఎస్ఎస్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కార్తీక సోమవారం నాడు శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో నూతన దీక్షా వస్త్రాను, నూతన మాలలను ఎంఎస్ఎస్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ న్యాయవాది మాదాల మనజ్ కుమార్ అయ్యప్ప స్వామి మాలధారణ భక్తులకుఅందజేశారు. ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడుతూ మాల ధారణ భక్తులకు తమ చారిటబుల్ ట్రస్టు ద్వారా నూతన వస్త్రాలతో మాలధారణ చేయించి, మరొక జత నూతన వస్త్రాలనుఅందజేయడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నాను అని అన్నారు. భవిష్యత్తులో ఎంఎస్ఎస్ చారిటబుల్ ట్రస్టు ద్వారా మరి మీ సేవాకార్యక్రమాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి సేవా సంఘ సభ్యులు నల్లబోతుల మురళి, ఆర్యవైశ్య మీడియా చైర్మన్ చక్కా వెంకటకేశవరావు, రాంబాబు పేర్కొన్నారు.